సాక్షి
ఖమ్మం

ఆదివారం । 24 । డిసెంబర్ । 2023



క్రిస్మస్ శోభ

క్రిస్మస్ పర్వదినాన్ని సోమవారం ఘనంగా జరుపుకునేందుకు జిల్లాలోని క్రైస్తవులు సిద్ధం కాగా, చర్చిలను ముస్తాబు చేశారు. 8, 9లో



క్రీడల్లోనూ రాణించాలి

రాష్ట్ర స్థాయి అండర్–17 బాలికల క్రికెట్ పోటీలను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించి మాట్లాడారు. 10లో

గరిష్టం / కనిష్టం
30° / 17°

వాతావరణం

జిల్లా అంతటా ఆదివారం చలిగాలుల తీవ్రత ఉంటుంది. సాయంత్రం తర్వాత చలి మరింత పెరిగి, మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

మంత్రి తుమ్మలను కలిసిన కేఎంసీ కమిషనర్



మంత్రి పుష్పగుచ్ఛం ఇస్తున్న కమిషనర్

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శనివారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి కలిశారు. హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

28న మాస్టర్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నున్నా రాధాకృష్ణ తెలిపారు. వివిధ వయస్సు గ్రూప్‌ల్లో పురుషులు, మహిళల వారీగా పరుగు, నడక, లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్, హ్యామర్‌త్రో, జావెలిన్, డిస్కస్‌త్రో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు వయస్సు ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని, ఇక్కడ ప్రతిభ కనబర్చే వారితో జనవరిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జట్టును ఎంపిక చేస్తామని తెలిపారు. వివరాల కోసం 98482 34756, 94900 21220 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

టీజీవోస్ నూతన కమిటీ



సత్యనారాయణ, అధ్యక్షుడు



వేలాద్రి, కార్యదర్శి

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల(టీజీవోస్) సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో సమావేశమైన గెజిటెడ్ అధికారులు కార్యవర్గాన్ని ఎన్నుకోగా, వివరాలను బాధ్యులు వెల్లడించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, అసోసియేట్ అధ్యక్షుడిగా వాసిరెడ్డి శ్రీనివాస్‌తో పాటు తొమ్మిదేసి మంది ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటరీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈమేరకు నూతన కార్యవర్గం ప్రభుత్వ పాలన, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడంలో ముందు నిలవాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు.

ఉత్తర ద్వారాన్ని తెరుస్తున్న అర్చకులు, ఆలయ సిబ్బంది



భూలోక వైకుంఠమే...

భద్రగిరి భూలోక వైకుంఠంగా మారింది. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన శ్రీ సీతాలక్ష్మణసమేత రామచంద్రస్వామిని దర్శించిన భక్తులు తన్మయత్వంతో మైమరిచారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, ధూపదీపాలు, జయజయ గంటల నడుమ గరుడ వాహనంపై రామయ్య, గజవాహనంపై సీతమ్మ, హనుమత్ వాహనంపై కొలువుదీరిన లక్ష్మణస్వామి వార్ల దర్శనాలతో భద్రాచల దివ్యక్షేత్రంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఒకవైపు దివ్యతేజంతో రామయ్య స్వామి, మరోవైపు విద్యుత్ దీపాలతో వెలుగొందుతున్న రామాలయ ప్రాంగణం భక్తులను మరింతగా ఆకర్షించాయి. – భద్రాచలం

భద్రగిరిలో వైభవంగా ‘ముక్కోటి’ వేడుకలు

- ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన సీతారామచంద్రస్వామి
- తిలకించి పులకించిన భక్తజనం
- రామనామ స్మరణతో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

రామనామ కీర్తనల నడుమ..

ఉత్తర ద్వార దర్శనానికి ముందు శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం సుప్రభాత సేవ, విశేష అభిషేకాలు గావించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామివారిని ఆలయ మర్యాదలతో వెండి గరుడ వాహనంపై ఉత్తర ద్వారంలోకి తీసుకొచ్చారు. దేవస్థాన హరిదాసులు శ్రీరామ కీర్తనలను పాడారు. అనంతరం స్థానాచార్యులు కే.ఈ. స్థలశాయి వైకుంఠ ఏకాదశి ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. రామయ్య, సీత, లక్ష్మణ వాహనాల ప్రత్యేకతల గురించి తెలియజేశారు. సరిగ్గా 5 గంటలకు వివిధ మంగళ వాయిద్యాలు మోగుతుండగా వేదఘోష నడుమ వైకుంఠద్వారం తలుపులు తెరుచుకున్నాయి.

ఇల వైకుంఠమాయె..

వైకుంఠాన్ని మైమరిపించేలా ప్రత్యేకంగా అలంకరించిన ఉత్తర ద్వారంలో ధూప, దీపాల నడుమ దర్శనమిచ్చిన స్వామి, అమ్మవార్లను తిలకించిన భక్తులు పులకించిపోయారు. సుమారు గంట పాటు అక్కడ పూజలు నిర్వహించారు. నివేదన, ఫల నైవేద్యం, మంత్రపుష్పం సమర్పించిన తర్వాత వేదపారాయణం గావించారు. ఆస్థాన పండితులు చతుర్వేదాలను పఠించారు. శరణాగతి, దండకం అనంతరం ద్వార దర్శన ప్రాశస్త్యాన్ని అర్చకులు వివరించారు. ఈ ఏకాదశి రోజున వైకుంఠంలో ముక్కోటి దేవతలు శ్రీ మహా విష్ణువును దర్శించుకుంటారని,



ఉత్తరద్వారం నుంచి దర్శనమిస్తున్న శ్రీసీతారామచంద్రస్వామి

అందుకే వైకుంఠ ఏకాదశి రోజున స్వామి వారిని దర్శించుకుంటే ముక్కోటి దేవతలను దర్శించుకున్నంత పుణ్యఫలం దక్కుతుందని వేద పండితులు వివరించారు.

వైభవంగా తిరువీధి సేవ..

ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన అనంతరం శ్రీసీతా లక్ష్మణ సమేతుడైన స్వామివారు తిరువీధి సేవకు బయలుదేరారు. గరుడ వాహనంపై రామచంద్ర మూర్తి, గజ వాహనంపై సీతమ్మవారు, హనమత్ వాహనంపై లక్ష్మణస్వామి కొలువుదీరి రాజవీధి మీదుగా తాతగుడి వరకు తిరువీధి సేవకు వెళ్లారు. వారికి ముందు ఆండాళు అమ్మవారు, ఆళ్వార్ దేవతలు ఊరేగారు. వైభవంగా సాగిన తిరువీధి సేవలో వందల సంఖ్యలో భక్తులు స్వామివారి వెంట నడవగా గోవిందరాజ స్వామివారి ఆలయం వద్ద స్వామి వారు ప్రత్యేక పూజలందుకున్నారు. ఆ తర్వాత గ్రామ ప్రదర్శనగా ఆలయానికి చేరుకున్నారు.

శ్రీరామ నామ స్మరణలతో మార్మోగిన భద్రగిరి..

ముక్కోటి ఏకాదశి సందర్భంగా మిథిలాస్టేడియం ప్రాంగణ పరిసరాలు ‘జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్’ నామస్మరణలతో మార్మోగాయి. నేత్రపర్వంగా సాగిన ఈ వేడుకకు రాష్ట్ర నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పవిత్ర గోదావరీ నదిలో శుక్రవారం రాత్రి జరిగిన స్వామి వారి తెప్పోత్సవాన్ని తిలకించిన భక్తులు రాత్రికి భద్రాచలంలోనే బస చేసి శనివారం తెల్లవారుజామున ఉత్తర ద్వారం ద్వారా రామయ్యను దర్శించుకున్నారు. చలిని కూడా లెక్క చేయకుండా తెల్లవారు జామున 2 గంటలకే ఉత్తర ద్వారం వద్దకు చేరుకున్నారు.

తగ్గిన వీవీఐపీల తాకిడి..

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భద్రాచలంలో తొలిసారి జరిగిన ముక్కోటి ఉత్సవాలకు వీవీఐపీల హడావిడి తగ్గింది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క సహా ప్రముఖులెవరూ హాజరు కాలేదు. కార్యక్రమంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు వీ.పీ.గౌతమ్, ప్రియాంక ఆల, భద్రాచలం, పినపాక, ఇల్లెందు, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, ఎస్పీ వినీత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని, మాజీ ఎంపీ పోరిక బలరాంనాయక్, ఆలయ ఈఓ రమాదేవి, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, ఏపీలోని పాడేరు ఐటీడీఏ పీఓ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రముఖుల తాకిడి లేకపోవడంతో సాధారణ భక్తజనం స్వామిని ప్రశాంతంగా దర్శించుకుని వెనుదిరిగారు.





స్వామి దర్శనానికి మిథిలాస్టేడియంలో వేచిఉన్న భక్తజనం

భారమున్నా వాగ్దానాలన్నీ నెరవేరుస్తాం



క్రిస్మస్ దుస్తులు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

- పాలేరులో ప్రజల వద్దకే పాలన
- అధికారులు సమర్థవంతంగా పనిచేయాలి
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి: ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని, ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలందరూ ఆనందంగా ఉండేలా పాలన సాగిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, పౌరసంబంధాలు, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. గత ప్రభుత్వం మోయలేని అప్పుల భారాన్ని మిగిల్చి వెళ్లినా ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరతామని తెలిపారు. ఇప్పటికే రెండు గ్యారంటీలు అమలవుతుండగా మరో రెండింటిపై త్వరలోనే తీపికబురు అందించనున్నామని చెప్పారు. కూసుమంచి మండలం పాలేరులో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన క్రైస్తవులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. అలాగే, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులు, విద్యుత్ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు బీమా చెక్కులు అందజేశాక మంత్రి మాట్లాడారు. పాలేరులో తనపై ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు నమ్మకంతో భారీ మెజార్టీతో గెలిపించారని తెలిపారు. ఈమేరకు ప్రజల వద్దకే పరిపాలన తీసుకొచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ధరణి, గృహాల సమస్యతో ఇబ్బంది పడుతుండడం, ఆ రెండు శాఖలకు తానే మంత్రిగా ఉన్నందున సమస్య త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎవరిపై రాజకీయ కక్ష సాధించబోమని, కేసులు పెట్టబోమని మంత్రి స్పష్టం చేశారు. అధికారులను కూడా బదిలీ చేయబోనని, తప్పు చేసిన అధికారులే తప్పుకుంటారని తెలిపారు. ప్రజలు ఇబ్బంది పడకుండా అధికారులు సమర్థవంతమైన సేవలందించాలని సూచించారు. ఈసమావేశంలో ఆర్డీఓ గణేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, ఎంపీపీలు బానోత్ శ్రీనివాస్, వజ్జ రమ్య, బోడ మంగీలాల్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, తహసీల్దార్లు సంపత్‌కుమార్, రామకృష్ణ, అనురాధ, రాంబాబు, ఎంపీడీఓలు రమాదేవి, రవీందర్‌రెడ్డి, జమలారెడ్డి, శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో ఏడీఈ కోక్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఘనస్వాగతం

నేలకొండపల్లి: రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూర్యాపేట జిల్లాలో శనివారం జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నాక జిల్లాలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా జిల్లా సరిహద్దు గ్రామమైన నేలకొండపల్లి మండలం పైనంపల్లి వద్ద పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాలుస్తూ స్వాగతం పలికారు. అనంతరం రావెళ్ల కృష్ణారావు ఆధ్వర్యాన గజమాలతో సన్మానించారు. నాయకులు రమేశ్, భద్రయ్య, కోడాలి గోవిందరావు, భద్రయ్య, గూడవల్లి రాంబ్రహ్మం, రావెళ్ల కృష్ణారావు, రంగిశెట్టి వెంకటప్పయ్య, మామిడి వెంకన్న, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, కడియాల నరేశ్, లక్కం ఏడుకొండలు, యడవల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాజేశ్వరపురంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు నాగేశ్వరరావు కుటుంబాన్ని పొంగులేటి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

హైదరాబాద్ వెళ్లిన మంత్రి

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శనివారం జిల్లా పర్యటన ముగించుకుని రాత్రి హైదరాబాద్ వెళ్లారు. కూసుమంచి మండలంలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన ఖమ్మంలోని నివాసానికి చేరుకున్నారు. అక్కడ ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం హైదరాబాద్‌లో ఆదివారం జరగనున్న కలెక్టర్ల సమావేశంలో పాల్గొనేందుకు గాను పొంగులేటి వెళ్లారు.

సమాజ చైతన్యంలో కీలకంగా సాహిత్యం

‘ఈస్తటిక్స్’ పురస్కారాల ప్రదానోత్సవంలో కవి, రచయిత రవిమారుత్



కవి వసీరాను సత్కరిస్తున్న కవులు, నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: సమాజాన్ని చైతన్యం చేయడంలో సాహిత్యం కీలక పాత్ర పోషిస్తుందని ఈస్తటిక్స్ బాధ్యులు, కవి, రచయిత పి.రవిమారుత్ తెలిపారు. ఖమ్మంలోని హార్వెస్ట్ పాఠశాలలో శనివారం ఈస్తటిక్స్– 2023 సాహిత్య పురస్కారాలు, పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈసందర్భంగా రవిమారుత్ మాట్లాడుతూ పుస్తకాలు చదివి అనుభూతి చెందే ప్రజా సమూహం తగ్గిపోయిందని, సాహిత్యం సమాజానికి మేలు చేసేదిగా ఉన్నా ఆదరణ లభించడం లేదని తెలిపారు. అయితే, కథలు, కవితల పోటీల్లో పటుత్వం తగ్గిందని పేర్కొన్నారు. అనంతరం సాహితీవేత్తలు ముప్వా శ్రీనివాసరావు, ప్రసేన్, డాక్టర్ సీతారాం, కత్తి పద్మ, ఎల్ఎస్ఆర్.ప్రసాద్, ఎస్.నారాయణరెడ్డి, ప్రసాదమూర్తి, ముక్కామాల చక్రధర్, అనంతు తదితరులు మాట్లాడారు. అనంతరం కథలు, కవితల పోటీల్లో విజేతలకు నగదు పురస్కారాలను అందించారు. కవితల పోటీల్లో కవి వసీరా సంపుటి ‘సెల్ఫీ’కి రూ.40 వేల నగదు పురస్కారం అందజేయగా, అనిల్ డ్యానీ రాసిన గాంధారి వాన, లండ సాంబమూర్తి రచించిన నాలుగు రెక్కల పిట్ట, అరుణ నారదభట్ల రచించిన లోపలి ముసురుకు పురస్కారాలు అందజేశారు. కథావిభాగంలో శ్రీఊహ రచించిన లడాయి, స్వర్ణ కిలారు రచించిన ఆరో తనం, ఉమామహేశ్వర్ రచించిన సంభావనకు వరుసగా రూ.25వేల, రూ.15వేలు, రూ.10 వేల నగదు పురస్కారాలు అందించారు. ఇదే కేటగిరీలో పెద్దింటి అశోక్ రచించిన కలలు రాలుతున్న నేల, కుప్పిలి పద్మ రాసిన నా స్నేహితురాలు మణిపూరి ఎక్స్‌కు కూడా పురస్కారాలు దక్కాయి. వీటితో పాటు సురేష్ పిళ్లై, పి.శ్రీనివాస్‌గౌడ్, నాదెళ్ల అనురాధ, దాసరి రామచంద్రరావు, రాయప్రోలు మణశాస్త్రి, తాళ్లపల్లి యాకమ్మ, హుమాయిన్ సంఘీర్, కె.అనసూయ కథ, శిరంశెట్టి కాంతారావు రచించిన కథలను సంకలనంగా ప్రచురించి ఆవిష్కరించారు.

పకడ్బందీగా కోవిడ్ కట్టడి

వెంటిలేటర్లు, ఆక్సిజన్, మందులతో సర్వసన్నద్ధం

- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 2,724 పడకలు
- అందుబాటులో ఐదు వేల ర్యాపిడ్ కిట్లు
- ‘సాక్షి’ ఇంటర్వ్యూలో డీఎంహెచ్‌ఓ మాలతి



SAKSHI INTERVIEW సాక్షి

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో ఇప్పటివరకు కోవిడ్ ముప్పు లేదని.. ఒకవేళ కేసులు నమోదైనా కట్టడి చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.మాలతి వెల్లడించారు. కరోనా ఉధృతి పెరిగినా అందుకు తగ్గట్లు వైద్యసేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యాన జిల్లాలో చికిత్స చేసిన ఏర్పాట్ల వివరాలను ఆమె శనివారం ‘సాక్షి’కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

2,724 పడకలు

ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లాలో ముందస్తు కట్టడి చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 2,724 పడకలు సిద్ధం చేశామన్నారు. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 910, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 1,814 బెడ్లు సిద్ధం చేయడమే కాక మాక్‌డ్రిల్ నిర్వహించామని తెలిపారు. కోవిడ్ బాధితులు ఏ ఆస్పత్రిలో చేరినా వైద్య సేవలకు ఆటంకం లేకుండా సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

పరీక్షల కోసం 5వేల కిట్లు

కోవిడ్ పరీక్షలు నిర్వహించేందుకు ఐదు వేల ర్యాపిడ్ కిట్లు అందుబాటులో ఉన్నాయని డీఎంహెచ్‌ఓ మాలతి వివరించారు. ఇందులో రెండు వేల కిట్లు జిల్లా ఆస్పత్రిలో, మిగతావి పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులకు సరఫరా చేశామన్నారు. అనుమానంతో వచ్చే ప్రతీఒక్కరి నుంచి శాంపిల్స్ సేకరించి పరీక్షలు చేస్తామని, పాజిటివ్‌గా ఫలితం వస్తే ఆర్‌టీపీసీఆర్ టెస్ట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే, పాజిటివ్ కేసుల శాంపిల్స్ హైదరాబాద్‌లోని జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపిస్తామని తెలిపారు. జిల్లాలోని 26 పీహెచ్‌సీలు, నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు, ఆరు ఏరియా ఆస్పత్రులతో పాటు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ర్యాపిడ్ టెస్టులు నిర్వహిస్తారని, ఆర్‌టీపీసీఆర్ టెస్ట్ మాత్రం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని వైరాలజీ ల్యాబ్‌లో మాత్రమే నిర్వహిస్తారని ఆమె వెల్లడించారు.

చిన్నారులకు ప్రత్యేక వైద్యం

ఎవరైనా చిన్నారులు కరోనా బారిన పడితే వారికి ప్రత్యేకంగా వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశామని డీఎంహెచ్‌ఓ చెప్పారు. ఇందుకోసం జిల్లా ఆస్పత్రిలో ఏర్పాట్లు చేశామని తెలిపారు. చిన్నారులకు ప్రత్యేకంగా పది బెడ్లు సిద్ధం చేయగా, అవసరాన్ని బట్టి పెంచుతామని, న్యూబార్న్ పిల్లలకు సైతం ఆరు బెడ్లు సిద్ధం చేశామని వివరించారు.

ఆందోళన వద్దు.. జాగ్రత్తలు తప్పనిసరి

కోవిడ్ వ్యాప్తి నేపథ్యాన జిల్లా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీఎంహెచ్‌ఓ మాలతి సూచించారు. కరోనా వచ్చినా అంతగా ప్రభావం ఉండకపోవచ్చని అభిప్రాయపడ్డారు. జిల్లాలో ఇప్పటికే నూరు శాతం వ్యాక్సినేషన్ పూర్తయినందున, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తే సమస్య ఉండదని తెలిపారు. జ్వరంతో పాటు జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు తదితర లక్షణాలు ఉన్నవారు కరోనా పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఎవరికైనా కరోనా సోకినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, హోం ఐసోలేషన్‌లో వారం పాటు ఉండి చికిత్స తీసుకుంటే సరిపోతుందని తెలిపారు. అయితే, చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. అలాగే, ప్రజలందరూ భౌతిక దూరం పాటించడం, మాస్కులు ధరించటం, శానిటైజర్ వాడడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఎలాంటి సమస్య ఉండబోదని ఆమె స్పష్టం చేశారు.

మందులు, వెంటిలేటర్లు రెడీ

కరోనా బాధితులకు చికిత్స కోసం మందులు, వెంటిలేటర్లను సిద్ధంగా ఉంచామని డీఎంహెచ్‌ఓ తెలిపారు. అలాగే, ఆక్సిజన్ కొరత రాకుండా సిలిండర్లు, లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంక్‌లో సరిపడా నిల్వలు సమకూర్చుకున్నామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రస్తుతం 40, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 122 వెంటిలేటర్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఇక ఆక్సీ మీటర్లు, నెబులైజర్లు, పీపీ కిట్లు, ఎన్95 మాస్కులు సరిపడా ఉన్నాయని, యాంటీ బయాటిక్స్, స్టెరాయిడ్స్ డ్రగ్స్ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 12–14 ఏళ్లు, 15–17 ఏళ్లు, 18 ఏళ్లు పైబడిన వారికి నూరు శాతం మొదటి, రెండు డోస్‌లు కరోనా వ్యాక్సినేషన్ పూర్తయిందని, ప్రికాషనరీ డోస్ వేయించుకోని వారు సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాలని మాలతి సూచించారు.

క్లుప్తంగా

భద్రాద్రిలో ప్రత్యేక పూజలు



ఆలయంలో ప్రసాద్‌రెడ్డి – శ్రీలక్ష్మి దంపతులు

ఖమ్మంవన్‌టౌన్‌: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాద రెడ్డి – శ్రీలక్ష్మి దంపతులు శనివారం భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని సందర్శించారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రమంతా సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు.

అథ్లెటిక్స్‌ మీట్‌లో ప్రతిభ



అథ్లెట్లను అభినందిస్తున్న అధ్యాపకులు

ఖమ్మంస్పోర్ట్స్‌: హనుమకొండలో ఇటీవల జరిగిన కాకతీయ యూనివర్సిటీ స్థాయి అథ్లెటిక్స్‌ మీట్‌లో ఖమ్మం శ్రీకవిత డిగ్రీ కళాశాల అథ్లెట్లు ప్రతిభ చాటారు. కళాశాల విద్యార్థి ఎస్‌కే లాల్‌పాషా 100 మీటర్లలో ద్వితీయస్థానం సాధించగా, ఇతర విభాగాల్లో లాల్‌పాషాతో పాటు దినేశ్‌కార్తీక్‌, పవన్‌, సతీశ్‌ పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్‌ పారుపల్లి ఉషాకిరణ్‌, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సీహెచ్‌ రాధాకృష్ణమూర్తి, రోజారాణి, పీడీ రాజేశ్‌, అధ్యాపకులు శ్రీనివాసరావు, శరత్‌బాబు శనివారం అభినందించారు.

ముగిసిన స్విమ్మింగ్‌ ఎంపిక పోటీలు



ఎంపికైన క్రీడాకారులతో పీడీలు

ఖమ్మంస్పోర్ట్స్‌: కాకతీయ యూనివర్సిటీ పరిధి స్విమ్మింగ్‌ ఎంపిక పోటీలు శనివారం ఖమ్మంలోని సర్దార్‌ పటేల్‌ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి వరంగల్‌, ఖమ్మం, ఆదిలాబాద్‌ జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. బటర్‌ ఫ్లై, బ్రెస్ట్‌ స్ట్రోక్‌, ఫ్రీస్టైల్‌ అంశాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారితో కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేశారు. ఈ పోటీలను కాకతీయ యూనివర్సిటీ నుంచి హాజరైన డాక్టర్‌ భాస్కర్‌, ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్‌ కళాశాల పీడీ డాక్టర్‌ బి.వెంకన్న, స్విమ్మింగ్‌ కోచ్‌ కొండల్‌రావు పర్యవేక్షించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



చింతల సిద్ధు

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడు జిల్లా పరిషత్‌ పాఠశాల ఏడో తరగతి విద్యార్థి చింతల సిద్ధు జాతీయ స్థాయి నెట్‌బాల్‌ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల రంగారెడ్డి జిల్లా మేడ్చల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఆయనను జార్ఖండ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సిద్ధును సర్పంచ్‌ రామసహాయం హరితారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం బి.కృష్ణమోహన్‌రావు, పీఈటీ పీవీ రమణ, ఎస్‌ఎంసీ చైర్మన్‌ సైదులు తదితరులు అభినందించారు.

నేడు నెలనెలా వెన్నెల

ఖమ్మంగాంధీచౌక్‌: 'నెలనెలా వెన్నెల' 77వ అభ్యుదయ సాంస్కృతిక కదంబాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్‌ కళా సాంస్కృతిక సంస్థ (ఆర్క్స్‌) అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఏఎస్‌ కుమార్‌ తెలిపారు. ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో సాయంత్రం ఆరు గంటలకు మొదలయ్యే కార్యక్రమంలో వెలగలేరు థియేటర్‌ ఆర్ట్స్‌ ఆధ్వర్యాన 'నెట్‌' నాటిక ప్రదర్శన, పరుచూరి హిమన్య కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటాయని పేర్కొన్నారు. కళాకారులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని బాలిక



పోలీసులు చేరదీసిన బాలిక

మధిర: మధిర రైల్వే స్టేషన్‌లో శనివారం మధ్యాహ్నం నాలుగు నుంచి ఐదేళ్ల వయస్సు కలిగిన బాలిక ఒంటరిగా తిరుగుతుండడంతో ప్రయాణికులు గుర్తించారు. ఈ సందర్భంగా జీఆర్పీ సిబ్బందికి సమాచారం ఇవ్వగా, వారు బాలికను చేరదీసి ఖమ్మం శిశుగృహ సిబ్బందికి అప్పగించారు. కాగా, సదరు బాలికకు మాటలు రాకపోగా, ఏ భాషలో మాట్లాడినా అర్థం చేసుకోలేకపోతోంది. బాలిక ఆచూకీ తెలిసిన వారు 87126 58589 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఖమ్మం జీఆర్పీ ఎస్‌ఐ భాస్కర్‌రావు సూచించారు.

క్రిస్మస్‌ సందడి






పాల్వంచ: విద్యుత్‌ కాంతుల్లో ఆకట్టుకుంటున్న ఆర్‌సీఎం చర్చి (ఇన్‌సెట్‌) మందిరంలో ప్రత్యేక అలంకరణ

రేపు జిల్లావ్యాప్తంగా క్రీస్తు పుట్టిన రోజు వేడుకలు

- ముస్తాబైన పురాతనకాలం నాటి చర్చిలు
- విద్యుత్‌ వెలుగులు, స్టార్‌, పశువుల పాకలతో అలంకరణ
- పండుగ జరుపుకునేందుకు సిద్ధమవుతున్న క్రైస్తవులు

ఇల్లెందు/కొత్తగూడెంటౌన్‌: జిల్లావ్యాప్తంగా క్రిస్మస్‌ వేడుకలు జరుపుకునేందుకు క్రైస్తవులు సిద్ధమయ్యారు. ఈ నెల 25న క్రీస్తు జన్మదినంను పురస్కరించుకుని వేడుకలకు చర్చిలను ముస్తాబు చేశారు. ఇళ్లను అలంకరించుకున్నారు. క్రిస్మస్‌ మాసం కావడంతో క్రైస్తవ కుటుంబాలలో సందడి నెలకొంది. ఇప్పటికే మందిరాల్లో పిల్లలకు క్విజ్‌, డ్యాన్స్‌ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి, సోమవారం వేకువజాము నుంచి ప్రార్థనలు ప్రారంభంకానుండగా, ఆయా చర్చిలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్‌ కాంతులతో అలంకరించారు. జిల్లా కేంద్రంతోపాటు భద్రాచలం, పాల్వంచ, మణుగూరు, అశ్వారావుపేట, అశ్వాపురం, అన్నపురెడ్డిపల్లి, ఇల్లెందు, సుజాతనగర్‌, జూలూరుపాడు, దమ్మపేట తదితర ప్రాంతాల్లో చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. ఇళ్లు, చర్చిల్లో బైబిల్‌ పఠించనున్నారు.



ఇల్లెందులో 1902లో నిర్మించిన సీఎస్‌ఐ చర్చి

12 దశాబ్దాలు గడిచినా..

చెక్కుచెదరని ఇల్లెందు సీఎస్‌ఐ చర్చి

ఇల్లెందు పట్టణంలో గుండాల రోడ్‌లో కోర్టు వద్ద ఉన్న సీఎస్‌ఐ చర్చికి 121ఏళ్ల చరిత్ర ఉంది. 1902లో హెన్రీలార్డ్‌ బిషప్‌ ఆఫ్‌ మద్రాస్‌ ఈ చర్చిని నిర్మించారు. డంగు సున్నంతో నిర్మించడంతో 12దశబ్దాలు గడిచినా చెక్కు చెదరలేదు. తొలుత 35 కుటుంబాలు ప్రార్థనలు చేసుకునేలా నిర్మించగా.. క్రమంగా విస్తరించారు. చర్చికి అనుబంధంగా మిషన్‌ స్కూల్‌, ఆస్పత్రి నిర్మించారు. ఇక్కడ చదివిన పలువురు ప్రముఖులుగా ఎదిగారు. చర్చి పాలన డోర్నకల్‌ బిషప్‌ కె.పద్మారావు పర్యవేక్షణలో సాగుతోంది. చర్చిలో ఏటా క్రిస్మస్‌ సంబురాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. చర్చిలో అమర్చిన గడియారం గంటల శబ్దం ఊరంతా వినిపిస్తుంది. చర్చి ఆవరణలో ఆంగ్లేయులు నాటిన మొక్క ఇంకా ఉంది. అన్ని చెట్ల ఆకులు రాలిపోయే తరుణంలో పూలు పూసే ఈ వృక్షం ఎండిపోయినట్లు ఉంటుంది. కానీ సువాసన వెదజల్లే పూలు ఆకర్షణగా ఉంటాయి. కాగా సోమవారం జరిగే క్రిస్మస్‌ వేడుకలకు చర్చిని ముస్తాబు చేశారు.

భక్తిభావం ఉట్టిపడుతుంది



చర్చిలో భక్తి భావం, ప్రేమ ఉట్టి పడుతుంది. ప్రతీ ఆదివారం భక్తులువచ్చి ఆరాధన చేస్తారు. ప్రార్థనలకు అవసరమైన సామగ్రి చర్చిలో ఉంది. రేపేటి క్రిస్మస్‌ పండుగకు అందంగా అలంకరించాం.
–తోకల ఏసురత్నం, చర్చి కమిటీ కార్యదర్శి, ఇల్లెందు

క్రైస్తవులకు ఆరాధ్య పండుగ ఇదీ...



క్రిస్మస్‌ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకుంటాం. పండుగ పూట తెల్లార్లు ప్రత్యేక ప్రార్థనలు చేస్తాం. మరుసటి రోజున పేదలకు వస్త్ర దానం, అన్నదానం చేస్తాం.
–రెవరెండ్‌ పీజే ఫ్రాంక్లిన్‌, పాస్టర్‌, ఇల్లెందు

తోటివారి పట్ల ప్రేమానురాగాలు..



క్రిస్మస్‌ వేడుకలను ఘనంగా జరుపుకుంటాం. ప్రజలను పాపాల నుంచి కాపాడడానికే ప్రభువు అవతరించాడు. మన మందరం తోటివారి పట్ల ప్రేమానురాగాలను కలిగి ఉండాలి.
–రెవరెండం అభిజిత్‌ బిమాల, సెయింట్‌ ఆండ్రూస్‌ చర్చి పాస్ట్రేట్‌ చైర్మన్‌, కొత్తగూడెం

బైబిల్‌ పఠించాలి



కేక్‌లు కట్‌ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేస్తాం. అందరిని శాంతి మార్గంలో నడిపించడమే జీసస్‌ లక్ష్యం. ప్రతీ ఒక్కరు బైబిల్‌ పఠించాలి. బంధుమిత్రులతో ఆనందంగా పండుగ జరుపుకుంటాం.
–అమర్లపూడి కిరణ్‌కుమార్‌, డికన్‌ (పాస్టర్‌), సెయింట్‌ థామస్‌ చర్చి, రామవరం

ఆసియాలోనే రెండో అతిపెద్ద చర్చి..

కొత్తగూడెం పోస్టాఫీస్‌ సెంటర్‌లో ఉన్న సెయింట్‌ ఆండ్రూస్‌ (సీఎస్‌ఐ)చర్చి ఆసియాలోనే రెండో అతిపెద్ద చర్చిగా విరాజిల్లుతోంది. 1943లో ఈ చర్చిని నిర్మించినట్లు మత పెద్దలు తెలిపారు. ఇక్కడ ఒకేసారి 15 వేల మంది ప్రార్థన చేసుకునే అవకాశం ఉంది. చర్చి గోపురంపై ఆరు అడుగుల ఇత్తడి శిలువ ఉంటుంది. ఆలయ శుద్ధిస్థలంలో మొదటి నుంచి చివరి వరకు కలపతో క్రీస్తు భోజన బల్ల ఏర్పాటు చేశారు. రామవరంలోని సెయింట్‌థామస్‌ చర్చిని 1962లో బిషప్‌ సాల్మన్‌ ఆధ్వర్యంలో నిర్మించారు. ఇక్కడ కూడా ఎక్కువ మంది ప్రార్థన చేసుకునే వీలుంది. ఇల్లా జిల్లాలో అనేక చర్చిలు ప్రత్యేకతలు కలిగి ఉన్నాయి.



కొత్తగూడెంటౌన్‌: పోస్టాఫీస్‌ సెంటర్‌లోని సెయింట్‌ అండ్రూస్‌ (సీఎస్‌ఐ) చర్చి

క్రైస్తవులకు అండగా ప్రభుత్వం..

వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌

వైరా/కొణిజర్ల/కారేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవులకు అండగా నిలుస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోత్‌ రాందాస్‌నాయక్‌ తెలిపారు. వైరా, కొణిజర్ల, కారేపల్లిల్లో శనివారం శనివారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన క్రైస్తవులకు ప్రభుత్వం అందజేసిన కానుకలను పంపిణీ చేశారు. ఆతర్వాత కేక్‌ కట్‌ చేసి క్రైస్తవులు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే రాందాస్‌ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవులు ఆనందోత్సాహాల మధ్య క్రిస్మస్‌ పర్వదినాన్ని జరుపుకోవాలనే భావనతో కానుకలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వైరా మున్సిపల్‌ చైర్మన్‌ సూతకాని జైపాల్‌, తహసీల్దార్లు కేవీ.శ్రీనివాస్‌, తఫజల్‌ హుస్సేన్‌, సురేష్‌కుమార్‌, ఎంపీడీఓ కె.మహాలక్ష్మి, కాంగ్రెస్‌ నాయకులు, ప్రజాప్రతినిధులు, బొర్రా రాజశేఖర్‌, శీలం వెంకటనర్సిరెడ్డి, కట్ల రంగారావు, దార్న శేఖర్‌, పొదిల హరినాథ్‌, మిట్టపల్లి నాగి, బీడీ కే.రత్నం, వాంకుడోతు జగన్‌నాయక్‌, మాలోతు శకుంతల, వేణు, సురేష్‌, సూరంపల్లి రామారావు, కె.స్వర్ణలత, జి.కోటేశ్వరరావు, వడ్డె నారాయణరావు, తాతా సుధాకర్‌, అనుమోలు కృష్ణార్జునరావు, కోసూరి శ్రీనివాసరావు, రావూరి శ్రీనివాసరావు, ఆదెర్ల స్రవంతి, ఇమ్మడి రమాదేవి, తలారి చంద్రప్రకాశ్‌, బానోతు రామ్మూర్తి, మేదరి టోనీవీర ప్రతాప్‌ పాల్గొన్నారు. కాగా, కారేపల్లిలోని సంతగుడి(శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం)తో పాటు కొత్తూరుతండా దేవాలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెల్యే రాందాస్‌ నాయక్‌ పూజలు చేశారు. అలాగే, కారేపల్లి బీసీ కాలనీకి చెందిన హోలియాదాసరి సంఘం సభ్యులు ఎమ్మెల్యేను సనఆమనించి తమ సమస్యలు వివరించారు. నాయకులు టంటం వెంకన్న, దానబోయిన సమ్మయ్య, రావుల వెంకటేష్‌, తెలకలపల్లి సాలయ్య పాల్గొన్నారు.



వైరా : కేక్‌ కట్‌ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌, నాయకులు



వైరా రూరల్‌ : ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వైరారూరల్‌: మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో డీసీఎంఎస్‌ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌ నాయక్‌ ప్రారంభించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని కోరారు. వైరా మున్సిపల్‌ చైర్మన్‌ సూతకాని జైపాల్‌తో పాటు బొర్రా రాజశేఖర్‌, బీడీకే.రత్నం, మల్లు రామకృష్ణ, శీలం వెంకటనర్సిరెడ్డి, దొడ్డా పుల్లయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, నూతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.50 లక్షలు గల్లంతు

ఖమ్మంక్రైం: 'మీ ఫోన్‌ నంబర్‌కు రూ.లక్షల డ్రా తగిలింది. మేము పంపించే లింక్‌ క్లిక్‌ చేస్తే వివరాలు తెలుస్తాయి' అంటూ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చిన ఫోన్‌ను నమ్మిన వ్యక్తి తన ఖాతాలోని రూ.1.50 లక్షలు పోగొట్టుకున్నాడు. ఖమ్మం రాపర్తి నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఆగంతకుల చేతిలో మోసపోగా, శనివారం ఖమ్మం టూటౌన్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యువకుడు మృతి

ముదిగొండ: వరిగడ్డి దిండ్లు చుట్టే యంత్రంలో చేయి ఇరుక్కోగా తీవ్రగాయాలు కావడంతో ఓ యువకుడు(22) మృతి చెందాడు. ముదిగొండ మండలం ఖానాపురంలో శనివారం యంత్రం ద్వారా గడ్డి చుడుతున్నారు. మధ్యలో యంత్రం ఆగిపోగా యువకుడు పరిశీలిస్తుండగానే యంత్రం నడవడంతో చేయి అందులో ఇరుక్కుని తీవ్రగాయాల పాలై మృతి చెందాడు. కాగా, మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

నిర్మాణ పనుల్లో జీపీ కార్మికులు



రఘునాథపాలెం: మండలంలోని కామంచికల్‌కు చెందిన జీపీ కార్మికులతో సుతారీ పనులు చేయిస్తుండగా స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ ప్రహరీ నిర్మిస్తుండగా ప్రశ్నిస్తే గ్రామ కార్యదర్శి నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని ఆరోపించారు. ఈవిషయమై ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా విచారణ చేస్తామని తెలిపారు.

మహిళా సిబ్బందిపై దాడి

ఖమ్మంక్రైం: ఖమ్మం పాత బస్టాండ్‌ సమీపాన పెట్రోల్‌ బంక్‌లో పనిచేస్తున్న మహిళా సిబ్బందిపై శనివారం కొందరు దాడికియత్నించారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు టూటౌన్‌ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆ సమావేశంతో సంబంధం లేదు..

ఖమ్మం సహకారనగర్‌: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే ఉద్యోగుల సమావేశానికి గుర్తింపు సంఘాల జేఏ సీతో సంబంధం లేదని ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్‌ షేక్‌ అఫ్జల్‌ హసన్‌ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులను సంప్రదించి జేఏసీ తరఫున సన్మానం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

వాహనదారులపై కేసు నమోదు

రఘునాథపాలెం: అతివేగంగానే కాకుండా నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనం నడిపిన ఇద్దరిపై రఘునాథపాలెం పో లీసులు శనివారం కేసు నమోదు చేశా రు. సీఐ శ్రీధర్‌ ఆధ్వర్యాన వాహనాలు తనిఖీ చేస్తుండగా పువ్వాడనగర్‌కు చెందిన ఇద్దరు యువకులు ట్రాఫిక్‌ నిబంధనలకు విరుద్ధంగా వాహనం నడుపుతున్నట్లు గుర్తించారు. దీంతో వారిద్దరిపై కేసు నమోదు చేశారు.

దాడి ఘటనపై...

చింతకాని: మండలంలోని వందనం గ్రామంలో జరిగిన ఓ దాడి ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన రాజేశ్‌ గురువారం పొలం వద్దకు వెళ్లగా పాతకక్షల ను దృష్టిలో పెట్టుకుని పక్క పొలానికి చెందిన బోళ్ల శ్రీను కుటుంబ సభ్యులు ఆయనపై దాడికి దిగారు. ఘటనలో గాయపడిన రాజేశ్‌ శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాజేందర్‌ తెలిపారు.

హద్దులు పాతుతుండగా అడ్డుకున్న రైతులు

రఘునాథపాలెం: నాగపూర్‌ – అమరావతి జాతీయ రహదారి పనుల కాంట్రాక్టు దక్కించుకున్నామంటూ కొందరు శనివారం రఘునాథపాలెం వద్ద రైతుల పొలాల్లో హద్దురాళ్లు పాతేందుకు వచ్చారు. దీంతో వారిని రైతులు అడ్డుకున్నారు. ఇప్పటివరకు తాము భూమి ఇవ్వడానికి సమ్మతించకపోగా, ఎలాంటి పరిహారం ప్రకటించకుండానే భూముల్లోకి ఎలా వస్తారని నిలదీశారు. దీంతో సదరు వ్యక్తులు హద్దురాళ్లు తీసుకుని వెళ్లిపోయారని రైతు కిశోర్‌, తదితరులు తెలిపారు.

ఆధ్యాత్మిక శోభ...



ఉత్తరద్వారం నుంచి శ్రీ సీతారామచంద్ర స్వామివారి దర్శనానికి వేచి ఉన్న భక్తజనం



వేడుకల్లో ఈజీ రమాదేవి తదితరులు

భద్రాచల పుణ్యక్షేత్రంలో శనివారం ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో సందడి నెలకొంది. ముక్కోటి ఏకాదశి రోజు రామయ్య స్వామిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న భక్తులు భక్తి భావంతో ఉప్పొంగిపోయారు. కలెక్టర్‌, ఎస్పీ, ఎమ్మెల్యేలు కూడా స్వామివారిని దర్శించుకున్నారు. – స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌



తిరువీధి సేవకు బయలు దేరిన స్వామివారు



పురవీధుల్లో స్వామివారి తిరువీధి సేవ



ఉత్తర ద్వార దర్శనానికి హాజరైన ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, ఖమ్మం కలెక్టర్‌ గౌతమ్‌



బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ వినీత్‌





ఉత్తరద్వార దర్శనం చేసుకుంటున్న భద్రాద్రి కలెక్టర్‌ ప్రియాంక, భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు

వైభవంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజ చేస్తున్న గురుస్వాములు, పూజారులు

ఖమ్మంగాంధీచౌక్‌: ఖమ్మం ముస్తఫానగర్‌లో శనివారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ వైభవంగా జరిగింది. శ్రీదివ్య మణికంఠ అన్నదాన సేవా సమితి ట్రస్ట్‌ ఆధ్వర్యాన పడిపూజను పాకతిల్లం నారాయణ నంబూద్రి నిర్వహించారు. ఈ పూజలో మాలధారులు పెద్దసంఖ్యలో పాల్గొనగా, కోదాడ భాస్కర్‌ గురుస్వామి బృందం పాడిన భక్తి పాటలు అలరించాయి. సేవా సమితి చైర్మన్‌ చిర్రా రవి, ప్రధాన కార్యదర్శి చెరుకూరి కోటేశ్వరరావుతో పాటు సిరవటి కురమారయ్య, బండారు ఏడుకొండలు, గద్దం ఆయోధ్య, కూరపాటి రవితేజ, శేఖర్‌, మాచర్ల నరేష్‌, కృష్ణమూర్తి, రాంబాబు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అక్రమాలపై చర్యలు తీసుకోండి

- ఓటర్ల జాబితాలో భారీ ఎత్తున అవకతవకలకు పాల్పడుతోంది
- కేంద్ర ఎన్నికల సంఘం అధికారులకు వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని వినతి




మాట్లాడుతున్న పేర్ని నాని. పక్కన నాగార్జున, అబ్బయ్య చౌదరి, జోగి రమేశ్, లేళ్ల అప్పిరెడ్డి, గౌతమ్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఓటర్ల జాబితాలో టీడీపీ భారీ ఎత్తున అవకతవకలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అధికారుల బృందానికి ఫిర్యాదు చేశారు. మైపార్టీ డ్యాష్ బోర్డు.కామ్ వెబ్‌సైట్ ద్వారా ఓటర్ల వ్యక్తిగత వివరాలను టీడీపీ అక్రమంగా సేకరిస్తోందన్నారు. ఆ పార్టీకి మద్దతు తెలపని ఓటర్లను జాబితా నుంచి తొలగించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇందుకోసం తప్పుడు సమాచారంతో భారీ ఎత్తున ఫామ్–7లను ఎన్నికల సంఘానికి సమర్పిస్తోందన్నారు. పైగా దొంగే దొంగ అన్నట్లు టీడీపీ నేతలే ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడుతూ తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎన్నికల సన్నద్ధతపై విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఈసీ అధికారుల బృందం శనివారం కూడా సమీక్ష నిర్వహించింది. ఈ నేపథ్యంలో సీఈసీ బృందాన్ని మంత్రులు జోగి రమేశ్, మేరుగు నాగార్జున, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కొఠారు అబ్బయ్య చౌదరి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఫైబర్ నెట్ చైర్మన్ గౌతం రెడ్డి, నవరత్న పథకాల అమలు వైస్ చైర్మన్ నారాయణమూర్తిలతో కూడిన వైఎస్సార్‌సీపీ బృందం కలిసింది. ఈ సందర్భంగా ఢిల్లీలో ఈ నెల 14న సీఈసీకి చేసిన ఫిర్యాదులను మరోసారి వైఎస్సార్‌సీపీ నేతలు సీఈసీ బృందం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. ఓటర్ల జాబితాలో టీడీపీ అక్రమాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేశామని చెప్పారు.

నీళ్లివ్వండి.. కరెంట్ ఇస్తాం!

కృష్ణా జలాలపై మహారాష్ట్రకు విజ్ఞప్తి చేయనున్న రాష్ట్ర సర్కారు

- ఆ రాష్ట్రంలో కృష్ణా ఉపనదిపై ఉన్న కోయినా డ్యామ్ నుంచి నీటి విడుదల కోరాలని నిర్ణయం
- కోయినాలో విద్యుదుత్పత్తి ద్వారా అరేబియా సముద్రంలోకి నీళ్లు
- అలా వృథా చేయకుండా దిగువన ఆల్మట్టికి విడుదల చేస్తే మేలు
- అక్కడి నుంచి నారాయణపూర్ మీదుగా జూరాలకు నీళ్లు వచ్చే చాన్స్
- కోయినాలో కోల్పోయే మేర కరెంట్‌ను రాష్ట్రం నుంచి ఇస్తామనే ప్రతిపాదన
- శ్రీశైలం, సాగర్‌లలో నిల్వలు అడుగంటిపోవడంతో సర్కారు ఆలోచన



మహారాష్ట్రలోని కోయినా డ్యామ్

సాక్షి, హైదరాబాద్: కృష్ణానది బేసిన్‌లోని శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటిపోయిన నేపథ్యంలో.. యాసంగిలో సాగు, వేసవి తాగునీటి అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. మహారాష్ట్రలో కృష్ణా ఉపనది అయిన కోయినాపై ఉన్న డ్యామ్ నుంచి కృష్ణానదికి నీటిని విడుదల చేయించుకోవడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. కృష్ణా బేసిన్‌లో ఎగువన ఉన్న తొలి మేజర్ ప్రాజెక్టు అది. 105.27 టీఎంసీల సామర్థ్యంతో కోయినా నదిపై నిర్మించిన ఈ డ్యామ్‌ను జలవిద్యుదుత్పత్తి అవసరాలకు మాత్రమే వినియోగిస్తున్నారు. 1,920 మెగావాట్ల భారీ సామర్థ్యం దీని సొంతం. ఇక్కడ విద్యుదుత్పత్తి చేయడం ద్వారా వదిలే నీళ్లు.. దిగువన నదిలోకి కాకుండా, మరో మార్గంలో పడమర వైపు వెళ్లి అరేబియా సముద్రంలో కలుస్తాయి. ప్రస్తుతం డ్యామ్‌లో 86.32 టీఎంసీల నిల్వలు ఉన్నాయి. విద్యుదుత్పత్తి కోసం నీటిని వృధాగా సముద్రం పాలు చేయడానికి బదులుగా.. దిగువన ఉన్న తెలంగాణ అవసరాల కోసం కృష్ణానదిలోకి విడుదల చేయాలని మహారాష్ట్రను కోరేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. బదులుగా ఆ నీటితో ఎంత మేర విద్యుత్ ఉత్పత్తి కాగలదో.. అంతమేర మహారాష్ట్రకు ఉచితంగా సరఫరా చేయాలని యోచిస్తోంది. దీనిపై త్వరలోనే మహారాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్వయంగా లేఖ రాసే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు వెల్లడించారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో ఈ అంశం చర్చకు వచ్చిందని, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారని వివరించారు.

వందల కిలోమీటర్లు ప్రవహించి..

కోయినా డ్యామ్ నుంచి విడుదలయ్యే నీళ్లు సుమారు 118 కిలోమీటర్ల పొడవునా కోయినా నదిలో ప్రవహించి కృష్ణానదిలో కలుస్తాయి. అక్కడి నుంచి ప్రధాన పాయలో ప్రవహిస్తూ.. 518 కిలోమీటర్ల దూరంలోని ఆల్మట్టి రిజర్వాయర్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. ఆల్మట్టి నుంచి దిగువన ఉన్న నారాయణపూర్ రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి తెలంగాణ భూభాగంలోకి ప్రవేశించి జూరాల రిజర్వాయర్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. మొత్తంగా దాదాపు 900 కిలోమీటర్ల మేర ప్రవహించాలి. ఇలా జూరాలకు చేరుకున్నాక.. అవసరాన్ని బట్టి శ్రీశైలం జలాశయానికి, అక్కడి నుంచి నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు విడుదల చేసుకోవచ్చు. సాగర్ వరకు చూస్తే.. 1,400 కిలోమీటర్లు ప్రవహించి రావాల్సి ఉంటుంది.

ఆ రెండు రాష్ట్రాల సమ్మతి ఉంటేనే..

కోయినా డ్యామ్ మహారాష్ట్రలో ఉండగా.. ఆల్మట్టి, నారాయణపూర్ కర్ణాటకలో ఉన్నాయి. అంటే ఈ రెండు రాష్ట్రాల సమ్మతి వస్తేనే కోయినా డ్యామ్ నుంచి నీళ్లను తెచ్చుకోవడం సాధ్యమవుతుంది. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి ఉండటంతో పెద్దగా ఇబ్బందులు ఉండవని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. అయితే మహారాష్ట్రలోని బీజేపీ ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు ఎంతమేర అంగీకరిస్తుందన్నది సందేహమేనని అంటున్నాయి. గతంలో బీఆర్ఎస్ సర్కారు కూడా కోయినా డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయించుకోవడానికి ప్రయత్నించినా.. మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించలేదని వివరిస్తున్నాయి.

పొదుపుగా వాడుకుంటేనే నీళ్లు

శ్రీశైలం గరిష్ఠ నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 52.42 టీఎంసీల నీళ్లే ఉన్నాయి. నాగార్జునసాగర్ సామర్థ్యం 312.05 టీఎంసీలుకాగా.. 154.43 టీఎంసీలే ఉన్నాయి. వీటిలో డెడ్ స్టోరేజీకిపైన వినియోగించుకోగల నీళ్లు తక్కువే. అందువల్ల పొదుపుగా వాడుకుంటే వచ్చే వేసవిలో హైదరాబాద్ జంట నగరాలతోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తాగునీటి అవసరాలకు సరిపోతాయని నీటిపారుదల శాఖ అంచనా వేస్తోంది. అయితే ముందు జాగ్రత్త చర్యగా కోయినా డ్యామ్ నుంచి నీళ్లను విడుదల చేయించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. మహారాష్ట్ర అంగీకరిస్తే సాగునీటికి సైతం కొంత వరకు నీళ్లను విడుదల చేయవచ్చని ఆలోచిస్తున్నట్టు సమాచారం.


చాలా కాలం నుంచి కోరుతున్నా..

మహారాష్ట్రలోని పశ్చిమ కనుమల్లో పుట్టి.. కోయినా నది తూర్పు వైపు ప్రవహించి కృష్ణా నదిలో కలుస్తుంది. ఇలా కలిసేచోటు కన్నాపైన కోయినా నదిపై మహారాష్ట్ర భారీ డ్యామ్‌ను, జల విద్యుత్ కేంద్రాన్ని నిర్మించింది. అందులో విద్యుదుత్పత్తి చేశాక నీటిని పశ్చిమం వైపు విడుదల చేస్తోంది. ఆ నీళ్లు అటువైపే ప్రవహించి వృథాగా అరేబియా సముద్రం పాలవుతున్నాయి. కే–1 సబ్‌బేసిన్‌లోని ఈ కోయినా ప్రాజెక్టుకు గతంలో బచావత్ ట్రిబ్యునల్ 67.5 టీఎంసీల నీటిని కేటాయించగా.. బ్రిజేశ్ ట్రిబ్యునల్ 25 టీఎంసీలకు తగ్గించింది. కోయినా ప్రాజెక్టులో జలవిద్యుదుత్పత్తి చేయవద్దని దిగువన ఉన్న రాష్ట్రాలు చాలా కాలం నుంచి కోరుతున్నాయి. కానీ మహారాష్ట్ర పట్టించుకోవడం లేదు.

చంద్రబాబుతో ప్రశాంత్ కిషోర్ సమావేశం

సీఎం రమేష్ సొంత విమానంలో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన లోకేశ్

- గన్నవరం నుంచి నేరుగా చంద్రబాబు ఇంటికి రాక
- పీకేపై గతంలో తీవ్ర విమర్శలు చేసిన బాబు
- ఇప్పుడు ఆయనతోనే ఎన్నికల వ్యూహాలకు సమావేశం





సాక్షి, అమరావతి/గన్నవరం: ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ (పీకే) శనివారం టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. వారిద్దరూ మూడు గంటలకు పైగా సమావేశమైనట్లు సమాచారం. టీడీపీ నేత లోకేశ్‌తో కలిసి ప్రశాంత్ కిషోర్ శనివారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో హైదరాబాద్ నుంచి నారా గన్నవరం విమానాశ్రయానికి వచ్చారు. అక్కడి నుంచి ఇద్దరూ కలిసి ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లారు. ప్రశాంత్ కిషోర్‌తో చంద్రబాబు, లోకేశ్ రాజకీయ అంశాలపై చర్చించినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. రాబోయే ఎన్నికల్లో టీడీపీ పరిస్థితి ఏమిటనే దానిపై వారు మాట్లాడినట్లు తెలిపాయి. అనంతరం సాయంత్రం ప్రశాంత్ కిషోర్ గన్నవరం విమానాశ్రయానికి చేరుకొని, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తిరిగి వెళ్లిపోయారు. చంద్రబాబును మర్యాదపూర్వకంగానే కలిశానని సమావేశం తర్వాత ప్రశాంత్ కిషోర్ మీడియాకు తెలిపారు. ఆయన సీనియర్ నాయకుడని, అందుకే కలిశానని చెప్పారు. చంద్రబాబుతో ఏ అంశాలపై చర్చించారో వెల్లడించలేదు.

అప్పుడు ప్రశాంత్ కిషోర్ చేదు..

బిహార్ వాడికి ఇక్కడ పనేంటి అంటూ ప్రశాంత్ కిషోర్‌పై గత ఎన్నికల సమయంలో నానా రకాలుగా తూలనాడిన చంద్రబాబు.. ఇప్పుడు అదే ప్రశాంత్ కిషోర్‌తో సమావేశమవడం చర్చనీయాంశమైంది. వ్యక్తులను, పార్టీలను, సంస్థలను అవసరమైనప్పుడు అక్కున చేర్చుకోవడం, అవసరం తీరాక గిరాటెయ్యడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. సీపీఐ, సీపీఎం, బీజేపీ, జనసేన పార్టీలతో ఆయన ఆడుతున్న ఆటలు, అవసరం తీరాక వాటిని గడ్డిపరక కింద జమకడతారు. మళ్లీ అవసరమైతే అదే వ్యక్తులను చేరదీస్తారు. ఇదంతా కళ్లకు కనిపిస్తున్నదే. ఎన్నికల్లో మిత్రపక్షాలనే మోసం చేయడం బాబు హాబీ. ఇప్పుడు ప్రశాంత్ కిషోర్ విషయంలోనూ బాబు ఇదే తీరుతో వ్యవహరిస్తున్నారు. 'ఆయనో పెద్ద వ్యూహకర్త' అంటూ 2019లో ప్రశాంత్ కిషోర్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. బిహార్ నుంచి వచ్చిన ప్రశాంత్ కిషోర్ రాష్ట్రంలో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ప్రశాంత్ కిషోర్ అప్పట్లో చంద్రబాబుకు సమాధానం ఇస్తూ.. 'కళ్ల ముందు ఓటమి కనిపిస్తుంటే సీజన్లకు అనుగుణంగా రాజకీయాలు చేసే చంద్రబాబు అలా మాట్లాడటం తనను ఆశ్చర్యపరచలేదు' అంటూ కౌంటర్ ఇచ్చారు. బిహార్‌కు వ్యతిరేకంగా, అభ్యంతరకరంగా మాట్లాడడం మానేసి, ఏపీ ప్రజలు మళ్లీ ఆయనకు ఓట్లు ఎందుకు వేయాలో చెప్పాలని చంద్రబాబుకు సూచించారు. అప్పట్లో ప్రశాంత్ కిషోర్‌పై ఆరోపణలు గుప్పించిన లోకేశ్ ఇప్పుడు దగ్గరుండి ప్రత్యేక విమానంలో తీసుకొని వచ్చారు.

బీజేపీ నేత సీఎం రమేష్ విమానంలో వచ్చిన ప్రశాంత్

ప్రశాంత్ కిషోర్‌ను విజయవాడ తీసుకురావడానికి చంద్రబాబు బీజేపీలో ఉన్న తన అనుచరుడు సీఎం రమేష్‌కి చెందిన విమానాన్ని వాడుకోవడం పైనా చర్చ జరుగుతోంది. రిత్విక్ గ్రీన్ పవర్ అండ్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన విమానంలో లోకేశ్, ప్రశాంత్ కిషోర్ హైదరాబాద్ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ఈ కంపెనీ సీఎం రమేష్‌దనే విషయం అందరికీ తెలిసిందే. ఆ విమానంలోనే ప్రశాంత్‌ను తీసుకువచ్చిన లోకేశ్ మళ్లీ అదే విమానంలో తిరిగి హైదరాబాద్ తీసుకెళ్లారు. దీన్నిబట్టి సీఎం రమేష్ బీజేపీలో ఉంటూనే చంద్రబాబు కోసం పని చేస్తున్నారనే విషయం మరోసారి స్పష్టమైంది.

మెటీరియల్ బాగోకపోతే మేస్త్రి ఏం చేస్తాడు : అంబటి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అసలు మెటీరియల్ బాగోకపోతే ఏ మేస్త్రి అయినా ఏం చేస్తాడని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌తో శనివారం చంద్రబాబు భేటీ కావడంపై అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ.. ఎంతమంది పీకేలు వచ్చినా వైఎస్సార్‌సీపీని ఏమీ చేయలేరని అన్నారు. 'గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యూహకర్తగా పనిచేసిన బిహార్‌కు చెందిన ప్రశాంత్ కిషోర్ (పీకే) ఈ రోజు లోకేశ్‌ను, టీడీపీ పెద్దలను కలిశాడని.. ఆయన వారికి వ్యూహకర్తగా ఉండబోతున్నారన్న వార్త వచ్చింది. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యూహకర్తగా పనిచేశారు. ఆయన వ్యూహకర్తగా పనిచేసిన రోజుల్లో ఇదే లోకేశ్, ఇదే చంద్రబాబు నాయుడు ఆయన గురించి ఏ మాట్లాడారో గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఆయన పీకే కాదు.. బిహార్ డెకాయిట్ అని చంద్రబాబు అన్నారు. పీకే తోకలు కత్తిరిస్తాం. ఆయన ఏపీలో ఏమీ చేయలేడని అని కూడా అన్నారు' అని అంబటి గుర్తు చేశారు.

వైఎస్సార్‌సీపీతో కలిసి పనిచేస్తున్నాం

సీఎం జగన్ ఘనవిజయమే మా లక్ష్యం: ఐ–ప్యాక్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఏడాది నుంచి వైఎస్సార్‌సీపీతో కలిసి పనిచేస్తున్నామని ఐ–ప్యాక్ వెల్లడించింది. 'రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికి అనునిత్యం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు మా వంతు తోడ్పాటును అందిస్తాం. 2024 ఎన్నికల్లో సీఎం జగన్ తిరుగులేని విజయం సాధించడానికి కృషి చేస్తాం' అని ఐ–ప్యాక్ శనివారం ఓ ట్వీట్ ద్వారా స్పష్టం చేసింది.

జిల్లా వార్తలు

రామయ్యకు రూ.45 లక్షల విలువైన బంగారు తులసీ దళాలు



ఈఓకు బంగారు తులసీదళాలను అందజేస్తున్న భక్తులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామివారికి ఓ భక్తుడు బంగారు తులసీ దళాలను కానుకగా సమర్పించాడు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన బాలాజీ – శారద దంపతులు సుమారు రూ.45 లక్షల విలువైన 109 బంగారు తులసీ దళాలను ఆలయ ఈఓ రమాదేవికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దంతెవాడ - సుక్మా సరిహద్దుల్లో ఎదురుకాల్పులు

- ఘటనాస్థలి నుంచి తప్పించుకున్న మావోయిస్టులు

చర్ల: తెలంగాణ సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఎదురుకాల్పులతో దద్దరిల్లుతోంది. ఈమేరకు శనివారం కూడా దంతెవాడ – సుక్మా జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. రెండు జిల్లాల సరిహద్దులోని కాకడి, నహరి, గోగుండ కొండల్లో మావోయిస్టు పార్టీ దర్భా డివిజన్ కమిటీ కార్యదర్శి జగదీష్‌తో పాటు మరికొందరు ఉన్నారనే సమాచారంతో రెండు జిల్లాల డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ విభాగాలకు చెందిన పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసు బలగాలకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరపగా, పోలీసులు సైతం ఎదురుకాల్పులకు దిగారు. ఇరువర్గాల నడుమ అర గంట పాటు హోరాహోరీ కాల్పులు జరగగా, ఘటనాస్థలి నుంచి మావోయిస్టులు తప్పించుకుని పారిపోయారు. కాగా, ఘటనలో ముగ్గురు లేదా నలుగురు మావోయిస్టులు మృతి చెంది ఉండొచ్చని అనుమానిస్తున్న పోలీసులు కూంబింగ్ ముమ్మరం చేశారు.

మామిడిలో ముందస్తు పూత!

- ఈ ఏడాది అధిక దిగుబడికి అనుకూల పరిస్థితులు
- సస్యరక్షణ చర్యలు పాటిస్తే సత్ఫలితం
- భద్రాద్రి జిల్లా ఉద్యానశాఖ అధికారి మరియన్న సూచనలు



మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి మరియన్న

ఇల్లెందురూరల్: ఈ ఏడాది మామిడి రైతులకు ఆశాజనక పరిస్థితులు కనిపిస్తున్నాయి. మామిడిపూతకు అనుకూలమైన వాతావరణం ఉండడం, ఇటీవల తుపాన్‌తో ముందస్తుగా పూత వచ్చే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యాన సరైన సస్యరక్షణ చేపట్టి, జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి సాధించొచ్చని పేర్కొన్నారు. భద్రాద్రి జిల్లాలో 11,324 ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ప్రధానంగా ఇల్లెందు, అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట, ములకలపల్లి, చంద్రుగొండ, పాల్వంచ, జూలూరుపాడు, టేకులపల్లి మండలాల్లో మామిడి సాగు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా బంగినపల్లి, దశేరీ, కేసరి, హిమాయత్, రాయల్ స్పెషల్, తోతాపురి, చిన్న రసాలు తదితర రకాలు సాగవుతున్నాయి. ఈ సంవత్సరం మామిడిపూతకు అనుకూలమైన వాతావరణం, ఆశాజనక పరిస్థితులు ఉన్న నేపథ్యాన రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను భద్రాద్రి జిల్లా ఉద్యానశాఖ అధికారి జినుగు మరియన్న వెల్లడించారు.


పూత దశలో తీసుకోవాల్సిన చర్యలు

పూమొగ్గలు బయటకు వచ్చే వరకు నీటి తడి ఇవ్వకూడదు. మొగ్గ పగిలే దశలో పొటాషియం నైట్రేట్ 10 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే మొగ్గ త్వరగా వచ్చే అవకాశముంటుంది. జూన్, జూలైలో ఎరువులు వేయనివారు పిందె దశలో 1/2 కిలో యూరియా, 1/2 కిలో పొటాష్ ఎరువులు వేసుకోవాలి. నీటి వసతి లేని వారు పిందె దశలో ఒక శాతం యూరియా ద్రావణాన్ని 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. పూత ఆలస్యమైన తోటల్లో కాయ పెరుగుదల దశ సమయాన తప్పనిసరిగా డ్రిప్ ద్వారా నీరు పెట్టుకోవాలి. సాగునీటి సౌకర్యం లేని వర్షాధార తోటల్లో పెరుగుతున్న పిందెలు, కాయలపై ఒక శాతం యూరియా (10 గ్రాముల లీటరు నీటికి) పిచికారీ చేయాలి. తోటలో పూతంతా ఒకేసారి ఈ మాసంలో రావడానికి లీటర్ నీటికి మల్టీ–కె (పొటాషియం నైట్రేట్) 10 గ్రాములు, యూరియా 5 గ్రాములు కలిపిన చెట్లపై పిచికారీ చేయాలి. చెట్లపై పూతను ప్రేరేపించేందుకు తేలికపాటి నీటి తడి ఇవ్వాలి. పూత ఆలస్యంగా వస్తే కాయ పెరుగుదల దశలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండి పొడి వాతావరణం ఉంటుంది. ఈ క్రమంలో రసం పీల్చే పురుగులు (తామర పురుగులు, నల్లి) ఆశించి నష్టపరిచే అవకాశం ఉంటుంది.

తెగుళ్లు, సస్యరక్షణ చర్యలు

- **ఆకుమచ్చ:** ఆకులపై బూడిద రంగు మచ్చలు గమనిస్తే ముందు జాగ్రత్తగా నీటిలో కరిగే గంధకం మూడు గ్రాములు లేదా డైనోకాప్ ఒక మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి చెట్లపై పిచికారీ చేయాలి. ఆకులపై నల్లమచ్చలు ఉంటే అవి పూకొమ్మలకు సోకి పూత రాలిపోతుంది. దీనికోసం ముందుగా లీటర్ నీటికి కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములను కలిపి పిచికారీ చేయాలి. పూత, పిందె దశలో ఆకుమచ్చ వ్యాప్తి చెందితే లీటర్ నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- **ఆకు గూడు పురుగు:** ప్రస్తుతం మొగ్గ దశలో ఉన్న తోటల్లో ఆకు గూడు పురుగు నివారణకు ఒక లీటర్ నీటికి 3 మి.లీ.ల క్లోరోపైరిఫాస్, 2 మి.లీ.ల నువాన్ లేదా 3 మి.లీల క్లోరోపైరిఫాస్, 1 మి.లీ.ల కరాటేలను కలిపి పిచికారీ చేయాలి. పిచికారీ చేసే ముందు కంచె కర్ర సాయంతో ఆకు గూడులు తొలగించాలి.
- **బూడిద తెగులు:** పూత దశలో బూడిద తెగులు నివారణకు హెక్సకోనజోల్ 2 మి.లీ లేదా సాఫ్ రెండు గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **తేనె మంచు పురుగు:** తేనె మంచు పురుగు ఉధృతి ఎక్కువైనప్పుడు డైమిథోయేట్ 2 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **తామర పురుగు:** తామర పురుగులు అధికంగా ఉన్నప్పుడు లీటర్ నీటికి ఫిప్రోనిల్ 2 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ లేదా థయోమిదాక్సమ్ 0.3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి
- **పిండినల్లి:** చెట్ల కింద పాదల్లో పవర్ వీడర్‌తో మట్టిని బాగా కలియపెట్టాలి. దీంతో నేలలో ఉండే పిండినల్లి, పండు ఈగ కోశస్థ దశలు నాశనమవుతాయి. ఈ పురుగుల నివారణకు చెట్టు పాదలో క్లోరోపైరిఫాస్(1.5) పొడి మందు సుమారు 250 గ్రాముల చొప్పున చల్లాలి. పిండినల్లి నేల నుంచి చెట్టు పైకి పాకకుండా చెట్టు ప్రధాన కాండంపై గ్రీజు పూసిన ప్లాస్టిక్ పేపర్లను భూమి నుంచి ఒకటిన్నర అడుగుల ఎత్తులో చుట్టాలి. పండు, ఈగ ఉధృతిని గమనించేందుకు ఎకరానికి నాలుగు లింగాకర్షక బుట్టలు అమర్చాలి.
- **నల్లి:** నల్లి నివారణకు లీటర్ నీటికి డైకోఫాల్ 2.5 మి.లీ లేదా 1 మి.లీ ప్రాఫార్ (ఓమైట్) లేదా పైరోమెసిఫేన్ (ఒబెరాన్) 1.25 మి.లీ.ను కలిపి పిచికారీ చేయాలి.

జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి రద్దు



నాగేశ్వరరావు

నేలకొండపల్లి: రాష్ట్ర పశు సంవర్ధక శాఖ పరిధిలో పద్నాలుగేళ్లుగా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కొనసాగుతున్న కొర్లకుంట్ల నాగేశ్వరరావు పదవిని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో 2001లో ఈ సంస్థను ఏర్పాటు చేయగా, 2014లో తెలంగాణ ఏర్పడ్డాక టీఎస్ఎల్‌డీఏగా మార్చారు. 14 ఏళ్ల నుంచి నేలకొండపల్లి మండలంలోని రాయగూడెంనకు చెందిన నాగేశ్వరరావు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. రెండుసార్లు ఎన్నికల్లో గెలిచిన ఆయన, ఓసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంస్థ ద్వారా పాడి అభివృద్ధి, రైతులకు చేయూత, ఉచిత పశు వైద్య శిబిరాల నిర్వహణతోపాటు రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పదవీకాలంలో తనకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు
- రాష్ట్రస్థాయి అండర్–17 బాలికల క్రికెట్ పోటీలు ప్రారంభం
- తొలిరోజు మ్యాచ్‌లలో మెదక్, ఖమ్మం జట్ల విజయం



మాట్లాడుతున్న పినపాక ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు, పక్కన అధికారులు



గౌరవ వందనం సమర్పిస్తున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు

అశ్వాపురం: విద్యార్థులు చదువుకుంటూనే క్రీడల్లో కూడా రాణించాలని, తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని గౌతమీనగర్ కాలనీలో జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అండర్–17 బాలికల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల నుంచి జట్లు పాల్గొనగా, ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పాయంకు క్రీడాకారిణులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం బ్యాటింగ్ చేసి మెదక్ – ఆదిలాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. పోటీల్లో పాల్గొనడం ద్వారా క్రీడాకారుల నడుమ స్నేహసంబంధాలు బలోపేతమవడమేకాక శారీరకంగా, మానసికంగా ఉల్లాసం కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో భారజల కర్మాగారం జీఎం జగ్గారావు, ఎంపీపీ ముత్తినేని సుజాత, సర్పంచ్ బానోత్ శారద, స్కూల్ గేమ్స్ రాష్ట్ర కార్యదర్శి రామిరెడ్డి, డీవైఎస్ఓ పరంధామరెడ్డితో పాటు వినయ్‌సాగర్, వేణు, స్టెల్లా జ్ఞానవతి, పి.అనిల్‌కుమార్, బి.వీరన్న, ఆదినారాయణ, దశమిబాబు తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు మెదక్, ఖమ్మం జట్ల విజయం..

రాష్ట్రస్థాయి బాలికల క్రికెట్ పోటీల్లో భాగంగా మొదటి మ్యాచ్‌లో మెదక్ – ఆదిలాబాద్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఆదిలాబాద్ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 67 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన మెదక్ జట్టు 9.5 ఓవర్లలోనే రెండు వికెట్ల నష్టానికి 68 పరుగులు చేసి విజయం సాధించింది. రెండో మ్యాచ్ ఖమ్మం – హైదరాబాద్ జట్ల మధ్య జరగగా బ్యాటింగ్ ఎంచుకున్న ఖమ్మం జట్టు నిర్ణీత ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. ఈ జట్టులో అనన్య 50, అమృత 36 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు 12 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 46 పరుగులే చేయడంతో ఖమ్మం జట్టు విజయం సాధించింది. కాగా, మెదక్ జట్టులో 23 పరుగులు చేసిన ప్రియాన్ సింగ్, ఖమ్మం జట్టులో 50 పరుగులు చేసిన అనన్యకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు.

ఎస్సెస్సీలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న పీఓ ప్రతీక్‌జైన్, అధికారులు

భద్రాచలంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాల ఎస్సెస్సీ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. పదో తరగతి విద్యార్థుల కోసం నిష్ణాతులైన ఉపాధ్యాయులు రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను పీఓ శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. గిరిజన సంక్షేమ పాఠశాలల విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు ఈ స్టడీ మెటీరియల్ రూపొందించినట్లు తెలిపారు. కాగా, బోధన విషయంలో అశ్రద్ధ చూపే ఉపాధ్యాయులపై చర్యలు ఉంటాయని పీఓ హెచ్చరించారు. ఈకార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఏసీఎంఓ రమణయ్య, ఐటీడీఏ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

ఉమ్మడి జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు విధానం, ఇతర వివరాలతో రూపొందించిన పోస్టర్లను పీఓ ప్రతీక్ జైన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ జనవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏపీఓ డేవిడ్ రాజ్‌తో పాటు టీ.వీ.రాజు, దేవదాసు, గామయ్య తదితరులు పాల్గొన్నారు.